# బాంబోయ్ -
# బొంబాయి!

పోలాప్రగడ రాజ్యలక్ష్మి



బొంబాయి కాపురం చెయ్యాలన్న కూతురి, సరదా, పట్టుదల కాదనలేక, వెతికి వెతికి బొంబాయి బ్యాంక్ పనిచేస్తున్న ఓ చిన్న ఆఫీసరుని అల్లుడిగా తీసుకువచ్చాడు రామనాధం.

బొంబాయికాపురానికి వెళ్ళిందిసంధ్య.

బేంక్ కాలనీలో క్వార్టర్స్. తక్కిన క్వార్టర్స్‌లో ఇద్దరో ముగ్గురో తెలుగు వాళ్ళు. తక్కినవాళ్ళు తెలుగువాళ్ళుకాకపోయినా తన ఈడువాళ్ళు. అంతాబాగానే ఉందికాని, తను అనుకున్నట్టుగా రోజూ షైర్లూ, షికార్లూ, తాజ్‌కాంటినెంటల్‌లో డిన్నర్లూ, గేట్‌వేఆఫ్ఇండియాకి వాహ్యాళులూ, వి. టి. పేవ్‌మెంట్లమీద భర్తా తనూ చెయ్యీ చెయ్యీ పుచ్చుకుని నడవడాలూ, ఇవేవీ కుదరడం లేదు. ప్రొద్దుట ఎనిమిదింటికి వెళ్ళిన సర్వేశ్వరావు రాత్రి ఏడయితేగాని ఇంటికిచేరకోడు. ఓ లోకల్ ట్రైనూ, రెండుసిటీ బస్సులూ మారి నీరసంగా గడపలో కాలుపెడుతూన్న భర్తని షైరువెళదాం అని ఏం అడుగుతుంది. పోనీ ఆదివారం ఎక్కడికేనా ప్రోగ్రాం వేసుకుందాం అంటే, ఆ రోజున లక్ష పనులు - మామూలురోజుకంటే ఆ రోజుమరీబిజీగా ఉంటుంది, సరుకులు తెచ్చుకోవడం, వగైరా కార్యక్రమాలతో-

బొంబాయిలో తనసరదాలు తీరడం మాట అలా ఉంచి, తోచి చావడంలేదు మామూలు రోజుల్లో. ఆ మాటే అంది సంధ్య ఓ రోజున సర్వేశ్వరావుతో. అతను నవ్వి "ఇక్కడ లైఫ్ ఇలా యాంత్రికంగానే ఉంటుంది. సరే- సాయంత్రం నేను వచ్చేటప్పటికి రెడీగా ఉండు. ఓ ఫ్రెండ్ ఇంటికి వెళదాం. వస్తున్నాం అని అతనికి బ్యాంక్‌నుంచి

ఫోన్ చేసి చెప్తాను" అన్నాడు.

సాయంత్రం సరే శ్వర్రావు ఇంకా రాలేదు ఏం చీరకట్టుకోవాలో తేల్చుకో లేక సతమతమౌతున్న సమయంలో ఎవరో తలుపు తట్టారు తీరా చూస్తే పక్క ఫ్లాట్‌లో ఉండే షమ్మీర్!

పిల్లనెత్తుకుని బిక్కమొహంతో నుంచున్న షమీర్‌ని చూసి, వచ్చీ రాని హిందీలో "ఏమైంది అని అడిగింది సంధ్య

బ్రెడ్‌వాడు వస్తే, అయిదేళ్ళ పాపని ఎత్తుకుని ఇవతలకి వచ్చిందట. వచ్చేటప్పుడు తలుపులు పడిపోకుండా చిడత పెట్టటం మరచిపోయిందట. అంతేగాలికి తలుపులు ధనామంటూ మూసుకుని, లోపల గడియ పడిపోయిందట. తను ఇవతల ఉంది. తాళంచెవి లోపలఉంది. తాళంచెవి ఉంటేకాని, పడిపోయిన తలుపుని తియ్యడం కుదరదు. షమ్మీర్ కన్నీళ్ళ తరవాయిగా చెప్పింది.

ఆటోమేటిక్ లాక్స్‌తో ఉండేచిక్కు ఇదే!

లోపల ఉన్నప్పుడు తలుపులు పడిపోయినా, లేకపోతే కావాలని వేసేసినా, ఫరవాలేదు. గడియ పడినవైపు ఉంటారు కనుక, తాళం అవసరంలేకుండా గడియని చేత్తోతీసినా తియ్యొచ్చు బయటకి వెళ్ళేటప్పుడు, తాళంచెవి జేబులో వేసుకుని, తలుపుని దగ్గరగా లాగితే చాలు. లోపల గడియ పడిపోతుంది. దగ్గర తాళంచెవి ఉందికనుక దాంతో తలుపు తెరవవచ్చు. ఇవతలనుంచి తాళంచెవి తిప్పితే లోపల గడియ వస్తుంది. కాని చిక్కల్లా, దగ్గర తాళంచెవి పెట్టుకోకుండా బయటికి వెళ్లేటప్పుడు తలుపులు దగ్గరకు లాగేసినా, లేదా, ఇలా షమ్మీర్‌లాగ అదమరచి బయటఉండగా ఏ గాలివిసురుకో తలుపు పడిపోయినా, ఇంకాతలుపు బందే! తలుపులు బద్దలకొట్టాల్సిందే!. ఆ బిల్డింగ్‌లోనే అన్నమాటేవిటి, బొంబాయిలో చాలా ఇళ్ళకి ఉండేవి ఇలాంటి ఆటోమేటిక్ లాక్స్ వీటితో ఇంకోచిక్కు, ఏ తాళంచెవితోటి ఆ తలుపు రావలసిందే - ఇంకొకటింటి తాళం చెవితోటి వచ్చివారాదు.

ఇదంతా తనకి కాపురానికి వచ్చిన రోజున పెద్ద పాఠం చెప్పినట్లు సోదాహరణంగా ప్రయోగం చేసి చూపించి మరీ చెప్పాడు సర్వేశ్వర్రావు.

అసలామాటకొస్తే బొంబాయి క్రొత్తగా కాపురానికి వచ్చిన ప్రతీ అమ్మాయికి భర్తచెప్పేదీ చెప్పవలసిందీ మొట్టమొదటి పాఠం ఇదే! ఆ పాఠం జ్ఞాపకం ఉంచుకోవడంవల్ల షమ్మీర్‌కి వచ్చిన ఇబ్బంది ఏదో అర్థంచేసుకుంది సంధ్య.

"అయితే ఓ తాళంచెవి లోపలఉండి పోయింది. మరో డూప్లికేట్ తాళంచెవి మీ వారు పట్టికెళ్ళారు. ఆయన వచ్చేదాకా తలుపు తెరవడానికి లేదు. అంతేనా? సరే మీ వారు వచ్చేదాకా వరండాలో ఏంనిలబడి ఉంటారు? ఇలావచ్చి కూచోండి" అంటూ కుర్చీ చూపించింది సంధ్య.

షమ్మీర్ పాపతో వచ్చి కూర్చుంది. కాస్సేపయ్యాక పాప, నోట్లోవేలేసుకుని చప్పరిస్తూ "బొమ్మ కావాలి!" అంటూ అలమారుకేసి చూపించింది. షమ్మీర్ వెంటనే బొమ్మతీసి కూతురికి ఇచ్చింది. తనయింట్లోబొమ్మ, తననిఅడక్కుండా

అంత చొరవగా కూతురికి ఇస్తుందేమిటి అని ఆశ్చర్యంగా సంధ్య షమ్మీర్‌కేసి చూసింది అటుఆడి ఇటుఆడి మొత్తానికి బొమ్మ విరక్కొట్టి, పై పెచ్చు 'ఆకలే!' అంటూ శోకాలు మొదలెట్టింది పాప.

"ఆయన ఎప్పుడొస్తారో- కాస్త పాపకి అన్నం పెట్టండి" అంది షమ్మీర్

"ఈ పూట మేం ఫ్రెండ్స్ ఇంటికి భోజనానికి వెళుతునాం అన్నం వండ లేదు-" అని అనొచ్చు కాని ఏంబాగుంటుం ? దేవుశా అని ఓ చిన్నగిన్నెలో బియ్యం పోసి స్టవ్ వెలిగించింది సంధ్య

ఇ తలో సర్వేశ్వర్రావు వచ్చాడు వస్తూనే 'ఏమిటి ఇంకా రెడీకాలేదా " అని కోపంగా అనబోయి వెంటనే పరిస్థితి అర్థంచేసుకుని ఊరుకున్నాడు పాప అన్నం తినడం అయింది తనూ సర్వేశ్వర్రావూ బయటికి వెళ్ళడానికి బట్టలు వేసుకున్నారు షమ్మీర్ లేచి "వెళ్ళొస్తాను" అంటుందేమోనని చూసింది సంధ్య ఆమెలో అటువంటి ప్రయత్నం ఏమీ కనిపించకపోగా, "మావారు ఎప్పుడొస్తారో ఏమో, నాకు నిద్ర వస్తోంది ఇలా పడుకుంటాను ఆయన వస్తే లేపండి " అంటూమంచం మీదఉన్న దిండూ, దుప్పటి సర్దబో యింది సంధ్యకి చిరాకుతో ప్రాణం విసిగి "ఇదిగో చూడండి మీవారు వచ్చే దాకా మా యింట్లో ఉంటే ఉండండి కాని, మేంమాత్రం అలా ఫ్రెండ్స్ ఇంటికి వెళ్ళాలి ఇప్పటికే ఆలస్యం అయింది కనిపెట్టుకునిఉంటారు రండి వెళదాం" అంటూ భర్తని హెచ్చరించి అతనితో కలిసి వెళ్ళిపోయింది సంధ్య.

రాత్రి పొద్దుపోయాక తిరిగి వచ్చే సరికి, ఆటబొమ్మలన్నీ చిందరవంద రగా పడిఉన్నాయి కూతురుకోసం అల మారులోని అన్నీతీసి ఇచ్చిఉంటుంది షమ్మీర్ సంధ్యకి విసుగూ అసహ్యం వేశాయి ఆ విసుగును దాచుకోలేక భర్తతో అంది, "తలుపుపడిపోతే తాళం రాదని తెలుసుకదా- జాగ్రత్తగా ఉండొద్దూ? ఎంత తెలివితక్కువ మొద్దో? చూడండి షమ్మీర్!" అని


సర్వేశ్వర్రావు నవ్వి "ఈ ఇబ్బంది ఎవరికేనా వచ్చేదే! అప్పుడే నెగ్గాం అనుకోకూడదు " అన్నాడు

'జాగ్రత్తగాఉంటే ఎందుకొస్తుంది?' అంటూ కొండంత ఆత్మవిశ్వాసంతో భర్తకేసి చూసి, చిరునవ్వు నవ్వి లైటు ఆర్పింది సంధ్య

పెళ్లైనంతవరకూ సంధ్య ఎప్పుడూ ఏమరిపాటు పడలేదు ఏడాదయింది ఇంట్లో ఓ పాప బయలుదేరింది సర్వేశ్వర్రావుకి ప్రమోషన్ కూడా వచ్చింది. "మనందరిలా కాదు సంధ్యకెలాగైనా జాగ్రత్త ఎక్కువ" అంటూ చుట్టుపక్కలవాళ్ళు సర్టిఫికెట్ కూడా ఇచ్చారు

ఓ రోజు చీకటి పడింది బ్యాంక్ ఫ్రెండ్స్ ఎవరో వచ్చారు ఎనిమిద యింది అని వాళ్ళు లేచి వెడుతూవుంటే సాగనంపడానికి సర్వేశ్వర్రావు ఇవతలకి వచ్చాడు. కబుర్లు చెబుతూ కొత్తచీర అంచులు సవరించుకుంటూ తనూ ఇవతలకి వచ్చింది లోపల పాప నిద్రపోతోంది.

ఇంతలో ధనామంటూ తలుపు పడిపోయింది




సంధ్య ఒక్కమారు నివ్వెరపడి ఉండిపోయి వెంటనే "అయ్యో! పాప లోపల ఉండిపోయింది" అంటూ లబోదిబోమంది

వెళ్ళబోతున్న బ్యాంక్ ఫ్రెండ్స్ ఆగిపోయారు

చుట్టుపక్కల ఫ్లాట్స్ వాళ్ళంతా పోగయ్యారు లోపల పాప గుక్కపట్టి ఏడుస్తోంది తలుపు తీయడం ఎలాగ? తాళంచెవులు రెండూ లోపలే ఉండిపోయాయి ఆలశ్యం అయితే లోపలఉన్న పాప ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోతుంది. ఎలాగ? ఏంచెయ్యాలి? అంతా తలలు పట్టుకుని కూర్చున్నారు ఎవరికీ ఏం తోచడం లేదు

ఒకాయనకి చప్పున ఆలోచన తట్టి ఫైర్ ఆఫీసుకి ఫోను చేశాడు వాళ్ళు వెంటనే వేన్‌లో వచ్చారు కాని తలుపులు బద్దలుకొట్టాలంటే పోలీసువాళ్ళ క్లియరెన్సు కావాలన్నారు దాంతో రాత్రికి రాత్రి పోలీసుస్టేషన్‌కి ఫోన్ చెయ్యాల్సి వచ్చింది పోలీసులు వచ్చి సాక్ష్యాలు, సంతకాలు, హామీలు అన్నీ అయ్యాక ఫైర్ ఆఫీసువాళ్ళు పని ప్రారంభించారు.

అర్ధరాత్రివేళ 'ధనా ధన్'మంటూ స్టంట్ పిక్చర్‌లోలాగ భయంకరమైన శబ్దాలు

ఏమైంది, ఏమైంది అంటూ కాలనీలో వాళ్ళంతా కంగారు కంగారుగా రావడం

వచ్చినవాళ్ళంతా హెచ్చరికలు కేకలు అరుపులు- లోపల్నుంచి చంటిపిల్ల గగ్గోలు పెట్టి ఏడవడం- పిల్లప్రాణం కడంటిపోతుంది బాబోయ్ అని సంధ్య ఏడుపు, సర్వేశ్వరరావు కేకలు- అంతా అలగోడూ- పాలగోర - -చన్నర రణగొణధ్వని అయ్యాక, ధబాలుమని తలుపులు విరిగి పడ్డాయి ఒక్క ఉదుటున సంధ్య లోపలికి పరిగెట్టి చంటిదాన్ని గుండెలకి హత్తుకుంది

మరునాడు ఫ్లాట్స్‌లోని ఆడవాళ్ళందరినీ సమావేశపరచి ఓ చక్కని సూచన చేసింది సంధ్య అంతే ఆ సూచనని నిమిషాలలో అమలుపరచేసారంతా అతి సంతోషంగా.

ఇప్పుడెవరైనా "ఎలావుంది బొంబాయిజీవితం?" అంటే "బాబోయ్" అంటూ గుండెలమీద చేయి వేసుకుంటుంది సంధ్య "నీ మోజు తీరిందా!" వెక్కిరింతగా అడుగుతున్నట్టు ఊగుతుంది తాళంచెవి.